క్లుప్తంగా

భూ సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం: మండలంలోని దళితుల భూములు ఏళ్ల తరబడి ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణదారుల నుంచి లబ్ధిదారులకు ఇప్పించాలని సీపీఐ మండల నాయకుడు పెద్దలపల్లి ప్రభాకర్, నారాయణ కోరారు. బ్రహ్మంగారిమఠంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ పంపిణీ వ్యవస్థ ద్వారా మండలంలోని పేదలకు భూములు పంపిణీ చేశారని ఆ భూములకు పట్టాలైతే పేదలకు ఇచ్చారని కానీ ఇంత వరకూ ఈ పట్టాలకు సంబంధించిన భూమి ఎక్కడ ఉందో లబ్ధిదారులకు చూపించలేదని పేర్కొన్నారు. భూములను అధికారులు స్వాధీనం చేసుకుని పట్టాదారులకు ఇవ్వాలని కోరారు.

సాంకేతికతను ఉపయోగించాలి

బద్వేలు అర్బన్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి ఉపయోగించాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) జిల్లా మహాసభలు బద్వేలు పట్టణంలో జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక బీజేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నేటి టెక్నాలజీ - విద్యార్థుల భవిష్యత్తు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ టెక్నాలజీలో మంచి ఎంత ఉందో, చెడు కూడా అంతే ఉందని, అయితే విద్యార్థులు, యువత టెక్నాలజీ ద్వారా మంచిని మాత్రమే గ్రహించాలని సూచించారు. కళాశాల అధ్యాపకుడు శివశంకర్‌రెడ్డి, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు హరిబాబు, వెంకటేష్‌నాయక్, వంశీ, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సింగరయ్య

పోరుమామిళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బీమా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విడ్స్ సంస్థ కౌన్సిలర్ సింగరయ్య ఆర్థిక విద్య, పొదుపు, బ్యాంకింగ్, బీమా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పథకాల గురించి, విద్యారుణాలు, పింఛన్ పథకాలు, బాలికల పొదుపు పథకాలు, ముద్ర రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, అధ్యాపకులు సులోచన, ఈశ్వరయ్య, రవిచంద్ర, పర్వీన్ పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ



అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మానవసేవే మాధవసేవ అని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు దివంగత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సతీమణి సానపురెడ్డి నాగఓబులమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక షాలోమ్ అనాథశరణాయంలోని అనాథ పిల్లలకు, తెలుగుగంగ రోడ్డులోని నిరాశ్రయుల వసతిగృహంలోని వృద్ధులకు ఆమె కుమారులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డిలు సమకూర్చిన దుప్పట్లు, నిత్యావసర సరుకులను మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అందజేశారు. అలాగే బోవిళ్ళవారిపల్లె గ్రామంలో నిర్వహించిన ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు హాజరై నాగఓబులమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇళ్లులేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు, గోపవరం మండలాల్లో పర్యటించి అర్హులైన లబ్ధిదారులతో అర్జీలు పెట్టించారు.

న్యామతుల్లాకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న న్యాయతుల్లా

ప్రొద్దుటూరు క్రైం : వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్నాల్డ్ జిమ్ న్యామతుల్లాకు సోమల్‌రాజ్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా భారతసేవా రత్న నేషనల్ బెస్ట్ సోషల్ సర్వీసు అవార్డును అందజేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకుమారి, సంస్థ చైర్మన్ శివరాజ్‌ల చేతుల మీదుగా న్యామతుల్లా అవార్డును అందుకున్నారు.

పార్కింగ్ పరేషాన్

- పట్టణంలో తీవ్రంగా పార్కింగ్ సమస్య
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు అవస్థలు



అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్ర వాహనాలు

బద్వేలు అర్బన్ : దినదినాభివృద్ధి చెందుతున్న బద్వేలు పట్టణంలో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. పట్టణంలో ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేకపోగా పోలీసు ఆంక్షలతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకుండా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, రోడ్డు ఆక్రమణలతో సమస్య మరింత జటిలమవుతుంది. ఇదిలా ఉంటే పట్టణంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలు ఉన్నప్పటికీ ఆ దిశగా మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కనిపించని పార్కింగ్ స్థలాలు

పట్టణంతో పాటు మండల పరిధిలో సుమారు 1.50 లక్షల మంది జనాభా నివసిస్తుండగా సుమారు 25 వేలకు పైగా ద్విచక్ర వాహనాలున్నట్లు అంచనా. పట్టణవాసులతో పాటు మండల పరిధిలోని ప్రజలు నిత్యం ఏదో ఒక పనిమీద పట్టణానికి వస్తుంటారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డు, సిద్దవటం రోడ్డు, పోరుమామిళ్ల రోడ్డు, మైదుకూరు రోడ్డు, కూరగాయల మార్కెట్ కూడలి, మాంసపు దుకాణాల వద్ద, స్టేట్ బ్యాంక్ ఏరియా తదితర ప్రాంతాలలో నిత్యం వివిధ రకాల పనులపై ప్రజలు వస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడేగాని పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల వైఫల్యం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో వాహనాలు రోడ్డుపై నిలుపకూడదని పోలీసులు గట్టిగా హెచ్చరిస్తుండడంతో పాటు కొన్ని సందర్భాలలో వాహనాలకు జరిమానా కూడా విధిస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ హోదా కలిగిన పట్టణాలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల సౌకర్యార్థం దృష్ట్యా తప్పనిసరిగా పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలి. అయితే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ, పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు సంయుక్తంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే పట్టణంలో ఎక్కడా కూడా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ఆటోస్టాండ్‌లకు కూడా అనువైన స్థలాలు లేకపోవడంతో ఆటోలను రోడ్లపైనే నిలుపుతున్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్లపై తోపుడుబండ్లను తొలగించి పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూరగాయల మార్కెట్ వెళ్లాలన్నా, కిరాణా షాపుకు వెళ్లాలన్నా బైక్‌పై వెళ్తుంటాం. అయితే వాహనం దుకాణం ఎదుట నిలిపి సరుకులు తీసుకుని వచ్చేలోపే పోలీసులు వాహనాలు తీసేయాలని హెచ్చరిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తే ఆ సమస్య ఉండదు.

జి.రామరాజు, బద్వేలు

ఏర్పాటుకు చర్యలు



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలు లేని కారణంగా వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మున్సిపల్, రెవిన్యూ అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ఎం.రాజగోపాల్, అర్బన్ సీఐ

ఆక్రమణలు తొలగిస్తున్నాం



పట్టణంలో చాలా ప్రాంతాల్లో పార్కింగ్‌కు స్థలం వదలకుండానే నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వాహనాలు రోడ్లపైన నిలుపుతున్నారు. ప్రధాన రహదారుల్లో కొత్తగా నిర్మించే ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తప్పనిసరిగా పార్కింగ్ స్థలం వదిలి ఉంటేనే అనుమతులు ఇస్తున్నాం. తాత్కాలిక పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బాషా

మైదుకూరు : అన్ని శాఖల సమన్వయంతో మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులకు గ్రామీణాభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. ఎంపీపీ కడప థామస్, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఖాజీపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని మండల అభివృద్ధి అధికారి దివిజ అన్నారు. నిధులు వినియోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, అన్ని శాఖ అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

అవగాహన సదస్సు

పోరుమామిళ్ల: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పట్ల మండల అధికారులకు, సర్పంచులకు, కార్యదర్శులకు, ఎంపీటీసీలకు అవగాహన తప్పనిసరి అని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా అన్నారు. శుక్రవారం సభాభవనంలో నిర్వహించిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. పంచాయతీలకు వచ్చే నిధులు, వాటి వినియోగంపై అవగాహన ఉన్నపుడే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ప్రణాళికబద్ధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి

గోపవరం : ప్రణాళికబద్ధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని డీఎల్‌పీఓ జె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. కోటి దీపోత్సవం



జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ స్వామినీ శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శ్రీకృష్ణ గీతాశ్రమంలో నిర్వహించిన కోటి దీపోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. పరవ శివుని విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో పల్లకి సేవను శివనామ స్మరణల మధ్య జరిపారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతీ మాతాజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పరమ శివునికి కార్తీక మాసం ఎంతో ప్రీతికరమని, కార్తీక మాస విశిష్టతను వివరించారు. మైదానంలో శివలింగాకారంలో ఏర్పాటు చేసిన ప్రాంతంలో భక్తులు శివనామస్మరణలు చేస్తూ కోటి దీపాలు వెలిగించి తమ కోరికలు తీర్చమని శరణువేడారు. కోటి దీప కాంతిలో ఆ ప్రాంతం నూతన శోభను సంతరించుకుంది. ఏర్పాట్లను శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ మేనేజింగ్ పల్లేటి ప్రభాకరరెడ్డి, ట్రస్టీలు చెన్నకేశవులు, వెంకటరమణ, భక్తులు పర్యవేక్షించారు.

25 నుంచి సమ్మె తప్పదు



మైదుకూరు : డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

మైదుకూరు : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి ప్రత్యక్ష సమ్మెకు దిగుతామని 108 అంబులెన్స్ సర్వీస్ కాంట్రాక్టు ఉద్యోగులు పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రవి ప్రసాద్, సాంబశివయ్య, రమేష్, వీరకుమార్, చెన్నారెడ్డి మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న ప్రభుత్వానికి, అరవిందో నిర్వహణ సంస్థకు, లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. అయినా వారు స్పందించలేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి తాము ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.

గోపవరం : తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ రామనాథరెడ్డికి 108 సిబ్బంది సమ్మె నోటీసు అందించారు. ఏఈఎంఎస్ నిర్వహణ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి 108 సిబ్బందికి ప్రతి నెల జీతాలు చెల్లింపులో తీవ్ర జాప్యం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామన్నారు.

అట్లూరు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం 108 సిబ్బంది మండల తహసీల్దారు శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించామని, పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి దిగుతామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



అట్లూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు



రాజుపాళెం గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అట్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎంపీడీఓ భాస్కర్‌బాబు, గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ భాస్కర్‌బాబు పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరరాజు పేర్కొన్నారు. స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకాలను మించిన మిత్రుడు లేడన్నారు. పుస్తక ప్రదర్శనలో మహనీయుల జీవిత చరిత్ర, వేమన పద్యాలు, సుమతీ శతకం, జనరల్ నాలెడ్జ్, నీతికథలు, రామాయణం, మహాభారతం తదితర పుస్తకాలను ఉంచారని వీటిని చదవాలని సూచించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

రాజుపాళెం : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొని పుస్తకాలను చదివారు. గ్రంథాలయంలో ఏఏ పుస్తకాలు ఉన్నాయో గ్రంథాలయ అధికారి ప్రతాపుడు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హనుమంత్, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల గ్రంథాలయంలో 57వ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వాడితే క్యాన్సర్, క్షయ తదితర భయంకరమైన వ్యాధులకు గురవుతారన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

మైక్‌సెట్ వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌కు శుక్రవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీక్లబ్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఇన్నర్‌వీల్ ప్రెసిడెంట్ భారతి, సరస్వతీ, ఉషారాణి, మణిశయన, కళ్యాణి, లక్ష్మీ, వాణి, సునంద, లక్ష్మీప్రసన్న, సరస్వతీరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్త అంత్యక్రియల్లో పాల్గొన్న రాచమల్లు



మునిరెడ్డి అంత్యక్రియలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గుండె పోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉండేల మునిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు నాయకులు మునిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 సర్వేను జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ శుక్రవారం తనిఖీ చేశారు. చౌడూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించిన ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి సర్వే సమాచారాన్ని ఎలా తీసుకోవాలో వివరించారు. పరీక్షలు జాగ్రత్తగా చేయాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రజలతో మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన వాళ్లందరికీ బీపీ, షుగర్, ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్, క్యాన్సర్‌కు సంబంధించిన ముందస్తు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ముందు రోజు ఆశా కార్యకర్తలు ఇళ్ల వద్దకు వచ్చి సర్వే గురించి సమాచారం ఇస్తారని, ప్రజలందరూ ఇంటి వద్దనే ఉండి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

ఎస్ఆర్ఐటీ ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ ఫైనలియర్ అన్ని బ్రాంచ్‌లకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ జి.టెక్ జైనెక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేటు లిమిటెడ్ వారు ఇంటర్న్‌షిప్, ఉద్యోగం కోసం ప్రాంగణ ఎంపికలు చేపట్టారన్నారు. ఇందులో బీటెక్ సీఎస్ఈకి చెందిన వై.వాసంతి, బి.మాధవి, లక్ష్మీశ్రావణి, పి.తిరుమలేశు, టి.నరేంద్ర, ఎస్.మహ్మద్ సోహెల్, ఈఈఈకి చెందిన డి.వంశీ, జి.రాజశేఖర్, ఎస్.మాలిక్ బాషా, గణేష్ గోవర్ధన్ యాదవ్, సీఎస్ఈ సివిల్‌లో పవన్ కుమార్‌రెడ్డి మొత్తం 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ హెచ్ఆర్ సుఫీయామ్, మేనేజర్ షాహిద్ తెలిపారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వేతనం ఇస్తారని జేటీఓ జె.సునీత పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

న్యాయం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్: కొత్తపల్లె పంచాయతీలోని ప్రమీలా రంగారెడ్డి నగర్ వెంచర్‌లోని ప్లాట్లు యజమానులకు స్థలం చూపించి, న్యాయం చేయాలని చెమికల శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 1996లో శీలం జయరామిరెడ్డి 43 ఎకరాల స్థలంలో ప్లాట్లు వేసి 1,400 మందికి విక్రయించారన్నారు. అయితే వెంచర్‌లో 8 ఎకరాలను భూ యజమానులు స్వాధీనం చేసుకున్నారని, దీంతో 400 మంది ప్లాట్లకు స్థలం లేదన్నారు. రెండు సంవత్సరాలుగా తమ ప్లాట్లకు స్థలం చూపాలని వెంచర్ యజమానిని కోరుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను వివరించామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్లాట్ల యజమానులు హుసేన్ బాషా, భూజితారెడ్డి, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్, చిన్నదస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి

బద్వేలు అర్బన్ : పన్ను బకాయిల వసూళ్లపై మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, సచివాలయ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.61 కోట్లు పన్నులు బకాయి ఉన్నాయని సంబంధిత కార్యాలయాలకు నోటీసులు అందజేశామని, వీలైనంత త్వరగా ఉన్నతాధికారులతో మాట్లాడి బడ్జెట్ విడుదల చేయించుకుని పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. అలాగే పెద్ద మొత్తంలో ఉన్న వంద మంది బకాయిదారులను గుర్తించి వారికి కూడా నోటీసులు అందజేయడం జరిగిందని, వారు కూడా సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు ప్రతిరోజూ వార్డుల్లో పర్యటిస్తూ పెండింగ్ బకాయిదారులపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో టీపీఓ సతీష్, ఆర్ఓ రఘునాధరెడ్డి, ఆర్ఐ షఫి, ఖాజా, టీపీబీఓ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఆరనీకుమా.. ఈ దీపం.. కార్తిక దీపం

హిందూ మతంలో కార్తీక పౌర్ణమికి చాలా ప్రాముఖ్యత ఉంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శివాలయాల్లో పిండి, నేతి దీపాలు వెలిగించిన మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో పూజలు చేస్తే శాంతి, శ్రేయస్సు, ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని భక్తుల నమ్మకం. పూజలు చేసిన వారికి శ్రేయస్సు లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. – సాక్షి నెట్‌వర్క్



ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు




చాపాడు: అల్లాడుపల్లెలో ...



మైదుకూరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అట్లూరు: ప్రత్యేక అలంకరణలో పార్వతిదేవి



బి కోడూరు : అఖిలానందేశ్వరి బ్రహ్మానంద ఆశ్రమంలో ...



బద్వేలు అర్బన్: కాశీవిశ్వేశ్వరస్వామిలో పూజలందుకుంటున్న శివలింగం



కాశినాయన : వరికుంట్ల శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చండీ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు



బ్రహ్మంగారిమఠం: పార్వతి పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : దీపాలు వెలిగిస్తున్న శివదర్శనానంద సరస్వతీ మాతాజీ